


చంద్రబాబు రాక రేపు



విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులోయలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఆయన శనివారం ఉదయం 9.45 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో 10.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి 11.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.35 గంటలకు అరకులోయ చేరుకుంటారు. బహిరంగసభ ముగిసిన తరువాత మధ్యాహ్నం 1.40 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోనసీమ జిల్లా మండపేట వెళతారు.



కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 38వ రోజూ కొనసాగింది. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని సిబ్బంది నినాదాలు చేశారు.

- వివరాలు Iలో

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎం.శ్రీభరత్, పి.గణబాబు, గండి బాబ్జీ తదితరులు.

- వివరాలు Iలో

వైసీపీ నుంచి నలుగురు కార్పొరేటర్లు సస్పెన్షన్?

- తమకు సమాచారం లేదంటున్న సదరు కార్పొరేటర్లు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు కార్పొరేటర్లను సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌పై బహిరంగంగా విమర్శలు చేయడంతో పాటు పార్టీకి రాజీనామా చేసిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌తో సన్నిహితంగా ఉంటున్న కొంతమంది కార్పొరేటర్లను తీరు మార్చుకోవాలని పార్టీ నేతలు హెచ్చరించారు. అయినప్పటికీ వాసుపల్లికి టికెట్టు ఇస్తే ఓడిస్తామంటూ పునరుద్ఘాటించడంతో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, 35వవ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 37 వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయం సంబంధిత కార్పొరేటర్ల వద్ద ప్రస్తావించగా తమకు ఇంతవరకూ ఎటువంటి సమాచారం అందలేదని చెప్పడం విశేషం. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన ఉత్తరాంధ్ర నేతల సమన్వయ సమావేశానికి నలుగురు కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వలేదు.



టికెట్ టెన్షన్

వైసీపీ నేతల్లో ఉత్కంఠ

- నాలుగో జాబితాలో విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రస్తావన నిల్
- సిట్టింగ్‌ల్లో పలువురికి అవకాశం ఉండదని ప్రచారం
- తెరపైకి రోజుకొకరి పేరు
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి కోసం అధిష్ఠానం అన్వేషణ
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పోటీపై ఇంకా రాని స్పష్టత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల్లో రోజురోజుకూ ఉత్కంఠ పెరిగిపోతోంది. అధిష్ఠానం గురువారం రాత్రి పదిన్నర గంటలకు నాలుగో జాబితా విడుదల చేసింది. అయితే అందులో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన నియోజకవర్గాల ప్రస్తావన లేదు. ఇప్పటివరకూ రెండు జిల్లాల్లో ఒక ఎంపీ స్థానంతో పాటు మూడు అసెంబ్లీ నియోజక వర్గాలపై మాత్రమే స్పష్టత ఇచ్చింది. మిగిలిన వాటి పరిస్థితి ఏమిటనే దానిపై సిట్టింగ్‌లతో పాటు ఆశావహుల్లో అయోమయం నెలకొంది.


గుడివాడ అమర్‌నాథ్


వాసుపల్లి గణేష్‌కుమార్


ముత్తంశెట్టి శ్రీనివాసరావు


అన్నంరెడ్డి అదీప్‌రాజ్

ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. టీడీపీ, జనసేనలు సీట్ల సర్దుబాటులో ఉండగా, వైసీపీ దఫదఫాలుగా అభ్యర్థులను (నియోజకవర్గాల సమన్వయకర్తల పేరిట) ప్రకటిస్తోంది. ఈసారి చాలామంది సిట్టింగ్‌ల మార్పు తప్పదని పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏడాది కిందటే సంకేతాలు ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే మార్పులు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకూ ఏడు పార్లమెంటు, 61 అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ప్రకటించారు. మొదటి జాబితాలో విశాఖ జిల్లా గాజువాక సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్థానంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును ఇన్‌చార్జిగా నియమించగా, రెండో జాబితాలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కాకుండా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మలసాల భరత్‌ను, పాయకరావుపేటకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు స్థానంలో కంబాల జోగులును సమన్వయకర్తలుగా నియమించారు. మూడో జాబితాలో విశాఖ లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జిగా బొత్స ఝాన్సీలక్ష్మిని నియమించింది. ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమిస్తూ గురువారం రాత్రి నాలుగో జాబితా విడుదల చేసింది. ఇందులో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన నియోజకవర్గాల ప్రస్తావన లేకపోవడంతో అనకాపల్లి ఎంపీతోపాటు రెండు జిల్లాల ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తల్లో ఉత్కంఠ వీడలేదు. విశాఖ జిల్లాలో భీమిలి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉన్నారు. ఆయన అభ్యర్థిత్వంపై పార్టీ క్యాడర్‌తోపాటు కార్పొరేటర్లు, మత్స్యకార సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. దీంతో వాసుపల్లి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించడంపై అధిష్ఠానం దృష్టిసారించిందనే ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం చాలాకాలంగా జరుగుతోంది. పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారికి అవకాశం ఇస్తారనే ప్రచారం ఉంది. మరోవైపు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు ... మిగతా 6వ పేజీలో

హౌసింగ్‌లో గందరగోళం

పీడీ జాయినింగ్ పెండింగ్

- కలెక్టర్ ఆగమన్నా... హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఆదేశాలతో ఛాంబర్‌కు కొత్త అధికారిణి

- ఎండీ వెబ్ కాన్ఫరెన్స్‌లో ఎంట్రీతో వివాదం
- ప్రస్తుతం తానే ప్రాజెక్టు అధికారినంటున్న ఇన్‌చార్జి పీడీ
- కార్యాలయ సిబ్బందికి సంకటం



జ్ఞానవేణికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఉషోదయ కూడలిలో గల ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్లిన జ్ఞానవేణికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):

జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతల స్వీకారంపై గురువారం గందరగోళం నెలకొంది. సెలవులో వెళుతున్న తాను తిరిగి వచ్చేంత వరకూ ఆగాల్సిందిగా కలెక్టర్ చెప్పినా...ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితురాలైన జ్ఞానవేణి కార్యాలయానికి వెళ్లి సీట్లో కూర్చోవడం, తరువాత ఎండీ నిర్వహించిన వెబ్‌కాన్ఫరెన్స్‌లో ఎంట్రీ కావడంతో వివాదం తలెత్తింది. వివరాల్లోకి వెళితే...

గృహ నిర్మాణ సంస్థ రెగ్యులర్ పీడీ పదవీ విరమణ చేయడంతో నాలుగు నెలల క్రితం జాతీయ రహదారుల విభాగం భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అఖిలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జ్ఞానవేణిని హౌసింగ్ పీడీగా నియమిస్తూ పది రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా ప్రొసీడింగ్స్ ఇస్తూ ఆదేశాలు ఇచ్చారు. దీంతో పీడీగా బాధ్యతలు స్వీకరించేందుకు గురువారం నగరానికి వచ్చిన ఆమె తొలుత కలెక్టర్ మల్లికార్జునను కలిసేందుకు వెళ్లారు. అయితే సొంత పనిమీద నాలుగు రోజులు బయటకు వెళ్లే బిజీలో ఉన్న ఆయన..ప్రస్తుతానికి బాధ్యతలు తీసుకోవద్దని సూచించారు. అయితే హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఆదేశాలతో ఆమె ఎంవీపీ కాలనీలో గల ఉషోదయ జంక్షన్‌లో ఉన్న హౌసింగ్ కార్యాలయానికి వెళ్లి పీడీ సీట్లో ఆశీనులయ్యారు. కార్యాలయంలో కొందరు అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం చెబుతూ పుష్పగుచ్ఛాలు ఇచ్చారు. జ్ఞానవేణి కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న విషయం ఇన్‌చార్జి పీడీకి సమాచారం లేదని తెలిసింది. కాగా సీట్లో కూర్చున్న అనంతరం పీడీగా బాధ్యతలు తీసుకున్నట్టు సీటీసీ సిద్ధం చేయాలని మేనేజర్‌కు జ్ఞానవేణి ఆదేశించారు. తరువాత కొద్దిసేపటికి జిల్లాల హౌసింగ్ పీడీలతో కార్పొరేషన్ ఎండీ వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎండీ వెబ్ కాన్ఫరెన్స్‌లో జ్ఞానవేణి ఎంటర్ కావడంతో అప్పటికే కాన్ఫరెన్స్‌లో ఉన్న ఇన్‌చార్జి పీడీ ... మిగతా 6వ పేజీలో

సిటీలో పేకాట డెన్‌లు

హోటళ్లు, ఇళ్లు, ఫంక్షన్‌హాళ్లలో నిర్వహణ

- స్థానిక పోలీసులతో అవగాహన
- నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు
- దాడులకు ఆదేశం
- సమాచారం సేకరణ బాధ్యత స్పెషల్‌బ్రాంచికి అప్పగింత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



పేకాటకు అడ్డుకట్ట వేయడంపై నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ దృష్టిసారించారు. పేకాట జరిగే ప్రాంతాలకు సంబంధించిన సమాచారం సేకరణ, దాడులు చేసే బాధ్యతను స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌బ్రాంచికి అప్పగించారు. ఈ నేపథ్యంలోనే గత రెండు రోజుల్లో నాలుగుచోట్ల దాడులు చేశారు.

గతంలో నగర శివారు ప్రాంతాల్లో గల తోటలు, గెస్ట్ హౌస్‌లలో పేకాట నిర్వహిస్తుండేవారు. అయితే ఇప్పుడు అంతదూరం వెళ్లడం ఎందుకనే భావనతో నగరంలోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, ఫంక్షన్ హాళ్లను పేకాటడెన్‌లుగా మార్చుతున్నారు. అక్కడే ఆహారం, మద్యం, రుణ సదుపాయం కూడా అందుబాటులో ఉంచుతున్నారు. పేకాటకు బానిసలై ఎంతోమంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పేకాట నిర్వహణపై స్థానిక పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ ముందస్తు అవగాహన కుదుర్చుకోవడంతో ఆటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలోని హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, ఫంక్షన్‌హాళ్లలో జరిగే ఆర్గనైజ్డ్ గ్యాంబ్లింగ్ (పేకాట నిర్వహణ)పై దృష్టి సారించాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ స్పెషల్ బ్రాంచికి కూడా ఈ బాధ్యతలు అప్పగించారు. సీపీ ఆదేశాల మేరకు స్పెషల్‌బ్రాంచి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ... మిగతా 6వ పేజీలో

ఖాళీగానే సీఏవో పోస్టు!

నాలుగు నెలలుగా వీఎంఆర్‌డీఏలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుని భర్తీ చేయని పాలకులు

- ఆచితూచి నిర్ణయమంటూ ఎడతెగని జాప్యం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (సీఏఓ) పోస్టు నాలుగు నెలల నుంచి ఖాళీగా ఉంది. గతంలో జి.నిర్మలమ్మ సీఏఓగా పనిచేశారు. డిప్యుటేషన్‌పై వీఎంఆర్‌డీఏకు వచ్చిన ఆమెను సెప్టెంబరు మొదటి వారంలో జగనన్న కాలనీల్లో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారనే కారణంపై ఇన్‌చార్జి కమిషనర్ అయిన కలెక్టర్ మల్లికార్జున వెనక్కి పంపించేశారు. అప్పటి నుంచి ఆ పోస్టులో ఇంకెవరినీ నియమించలేదు. జాయింట్ కమిషనర్ రవీంద్రకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నాలుగు నెలల నుంచి ఆయనే సీఏఓ పనులు కూడా చేస్తున్నారు. బిల్లులు ఆలస్యం కాకుండా ఉండేందుకు, ఎప్పటికప్పుడు క్లియర్ చేయడానికి రాత్రి 10 గంటల వరకు పనిచేయాల్సి వస్తోందని, అంతవరకు ఆయనతో పాటు తామూ కూడా ఉంటున్నామని సిబ్బంది చెబుతున్నారు.

రూ.వందల కోట్ల పనులు

విశాఖ జిల్లాలో 89 జగనన్న కాలనీలకు లేఅవుట్లు వేయడానికి భూములను చదును చేయడం నుంచి మౌలిక వసతులు కల్పించడం వరకు అన్ని పనులు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. వీటికి వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. గత రెండేళ్లలో సుమారుగా రూ.450 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు ఆయా కాలనీలకు నీటి సదుపాయం కల్పించడానికి రూ.150 కోట్లతో పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.160 కోట్ల బడ్జెట్ పెట్టుకొని పనులు చేయాలని వీఎంఆర్‌డీఏ నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు రూ.215 కోట్లు వెచ్చించారు. వీటిలో అత్యధికం రాయలసీమకు చెందిన కాంట్రాక్టర్లే చేస్తున్నార. వీటికి రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి కాకుండా వీఎంఆర్‌డీఏ నుంచి నిధులు మంజూరు చేస్తుండడంతో వెంట వెంటనే బిల్లులు మంజూరైపోతున్నాయి. ఇలాంటి చోట సీఏఓకి చేతినిండా పని ఉంటుంది. అటువంటి స్థానాన్ని నాలుగు నెలలుగా భర్తీ చేయకుండా ఉంచారు. ఇక్కడికి డిప్యుటేషన్‌పై రావడానికి అనేక మంది అధికారులు ఆసక్తి చూపుతున్నారు. మూడు, నాలుగు పేర్లతో ఫైల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ సెక్రటరీ కార్యాలయానికి పంపించారు. అక్కడ ఏ ఫైల్‌పై నిర్ణయం తీసుకోవాలన్నా కనీసం మూడు నెలల నుంచి ఆరు నెలల సమయం పడుతుందని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వానికి అవసరమైన నిధుల సమీకరణపైనే అక్కడి ఉన్నతాధికారులు పూర్తిగా దృష్టిని కేంద్రీకరించడం వల్ల ఇటువంటి ఫైళ్లను చూడడం లేదని అంటున్నారు. ఇక ఈ ప్రభుత్వంలో సీఏఓ పోస్టు భర్తీ కాదని, కొత్త ప్రభుత్వం వచ్చాకే నియామకం ఉంటుందని వీఎంఆర్‌డీఏ అధికారులు నిట్టూరుస్తున్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం ద్వంద్వ వైఖరి

- వివరాలు IIలో

ఇద్దరు సీఐలకు పోస్టింగ్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలకు పోస్టింగ్ ఇస్తూ, మరొకరిని బదిలీ చేస్తూ సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న టీవీ తిరుపతిరావుకి ఆనందపురం, సీహెచ్ శ్రీధర్‌కు పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. పద్మనాభం సీఐగా పనిచేస్తున్న ఎన్.సన్యాసినాయుడిని సీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఏయూను రాజకీయ కేంద్రంగా మార్చేశారు

- ఐదేళ్లలో భ్రష్టు పట్టించేశారు
- మాజీ మంత్రి గంటా మండిపాటు



విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాజకీయ కేంద్రంగా మార్చేశారని రాష్ట్ర మాజీ మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఆయన గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఘనచరిత్ర ఉన్న ఏయూను ఐదేళ్లలో భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. వర్సిటీల్లో రాజకీయాలు చొప్పించకూడదన్నారు. రాష్ట్రంలో మెజారిటీ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించారని ఆరోపించారు. తెలుగుదేశం హయాంలో ప్రతిభ ఆధారంగా సెర్చ్ కమిటీలు ద్వారా ఉప కులపతుల ఎంపిక చేపట్టేవారమన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు, పారిశ్రామికవేత్తలను కలిసేందుకు ముఖ్య మంత్రులు అంతర్జాతీయ స్థాయిలో దావోస్ వంటి సదస్సులకు వెళ్లడం ఆనవాయితీ అని, కానీ ఈ ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారి మాత్రమే వెళ్లారన్నారు. అంతకు ముందు చంద్రబాబు ఏటా వెళ్లేవారన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన నెల రోజుల్లోనే దావోస్ వెళ్లారన్నారు. ఇక్కడ సీఎం తాడేపల్లి ప్యాలెస్‌లో కృత్రిమ సెట్లు వేసుకుని ఆనందం పొందుతున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకపోగా, ఉన్నవి వేరే ప్రాంతాలకు తరలిపోతున్నాయని ఆరోపించారు. ఐటీ హబ్‌గా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన వ్యక్తిగా చంద్రబాబు పేరు చిరస్థాయిగా ఉండిపోతుందన్నారు. ఇచ్చిన హామీల అమలులో జగన్ విఫలమయ్యారని విమర్శించారు. విభజన తరువాత కాంగ్రెస్ నేతలు వైసీపీలో చేరారని, షర్మిల పీసీసీ అధ్యక్షురాలు కావడంతో అనేకమంది సొంతగూటికి చేరతారని, వైసీపీపై ప్రభావం చూపుతుందని అంచనా వేశారు.

జోన్-1లో ఏడుగురు తహసీల్దార్ల బదిలీ

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర (జోన్-1) జిల్లాల్లో ఏడుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న ఎం.పాల్‌కిరణ్‌ను శ్రీకాకుళం జిల్లా పొందూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ పాలనాధికారి ఎంవీ అప్పారావును ఇచ్ఛాపురం తహసీల్దార్‌గా నియమించారు. అలాగే విశాఖపట్నం నగర పాలక సంస్థ ఎస్టేట్ అధికారి కె.ఆనందరావును పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం, వీఎంఆర్డీఏ ప్రత్యేక తహసీల్దారు అడబాల శ్రీనివాసరావును పాచిపెంట, శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఆర్డీవో కార్యాలయ ఏవో బి.రాజమోహన రావును అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు, విజయనగరం జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న కె.శ్రీకాంత్‌ను అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట, శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న జీపీ సూర్యనారాయణను పాయకరావుపేట తహసీల్దార్‌గా బదిలీ చేశారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గండి బాబ్జీ


ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నజీర్, నివాళులర్పిస్తున్న నేతలు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

అక్కయ్యపాలెం, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. 26వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నూరు పార్టీ కార్యాలయంలో, సంగం ఆఫీస్ జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 43వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు న్టీఆర్ విగ్రహానికి, ఉత్తర టీడీపీ ఇన్‌చార్జి విజయ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు. రాజగిరి కన్నారావు, కొయిలాడ వెంకటేష్, కాళ్ల గౌరీ శంకర్‌నాయుడు, కన్నం వెంకటరమణారావు పాల్గొన్నారు. 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో నరసింహనగర్‌లో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. షేక్‌బాబ్జీ, కోట నరేష్, శెట్టి మోహన్‌దాస్, పలిశెట్టి అప్పన్న, ఎంపీ బాబ్జీ రావు, అనసూరి మధు, కె.అప్పలనర్సమ్మ, పుక్కళ్ళ పైడి కొండ తదితరులు పాల్గొన్నారు. 46వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పుక్కళ్ళ పైడికొండ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణపురంలోని ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. శ్యాం సుందర్, షైలపల్లి శ్రీను, లక్ష్మీ, లావణ్య, ఈశ్వరి, నూకన్న, యశోదమ్మ, ఆనందరావు, గోపి, సునీల్, జోష్ పాల్గొన్నారు. 47వ వార్డు రాంజీఎస్టేట్‌లో యాగాటి ఆదిలక్ష్మి చీరలు పంపిణీ చేశారు. చెంగల శ్రీను బాబు, నూకరాజు, నూకరాజు, కేఎస్ మణి, రమణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెంలో ...

మర్రిపాలెం: గ్రేటర్ 54వ వార్డు మర్రిపాలెం మహరాణివీధిలో టీడీపీ నేత కొలుసు సత్యారావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేసి బలహీనవర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానాయకుడు ఎన్టీఆర్ అన్నారు. మాధవరావు, సిమ్మా శ్రీను, చిటికెల నరసింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27, 42వ వార్డుల్లో...

దొండపర్తి: పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు వర్ధంతిని 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ పూలమాల వేసి నివాళులర్పించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కన్నం వెంకటరమణారావు, శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, జనపాల కృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. 27వ వార్డులో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. శ్రీనగర్ కూరగాయల మార్కెట్ వద్ద కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి సత్యనారాయణరెడ్డి, పి.లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణారావు, పి.గురునాథరావు, బీఏ రెడ్డి, కనకారావు పాల్గొన్నారు.

కంచరపాలెంలో...

కంచరపాలెం: 36వ వార్డు టీడీపీ నేతలు రైతుబజారు వద్ద పార్టీ కార్యాలయంలో పేదలకు దుప్పట్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. అనంతరం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.రాజు రెడ్డి, వై.కనకేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎస్.శంకరరావు, పి.నాగరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. 55వార్డు రెడ్డికంచరపాలెం ఆర్చ్ వద్ద నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేత రాజు రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పేదలకు పండ్లు, బియ్యం పంపిణీ చేశారు. 48వ వార్డు శ్రీనివాసనగర్‌లో గొర్లె అప్పారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గొర్లె నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో...

సీతమ్మధార: గురుద్వారా రోడ్డు ఎన్ఆర్ఐ ఆస్పత్రి సమీపంలో ఎన్టీఆర్ చిత్రపటానికి 14వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గొంప ధర్మారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. లక్ష్మణరావు, వీరభద్రరావు, తాతారావు, జగ్గారావు, పద్మ, నాగమణి, రాంబాబు, దేముడు పాల్గొన్నారు. 24వ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మలత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేముడుబాబు, శ్రీనివాసురెడ్డి, శివశంకర్, నూకరాజు, అప్పలరెడ్డి, పాల్గొన్నారు. 25వ వార్డు అధ్యక్షులు నమ్మి రవికుమార్ ఆధ్వర్యంలో సీతంపేట రాధాకృష్ణ మందిరం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇసరపు వెంకటలక్ష్మీవాసు తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో...

మురళీనగర్: బిర్లా జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. సనపల కీర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జయరాజ్, అప్పారావు, లలిత, మణికంఠ, ధవళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: గ్రేటర్ 30వ వార్డు జగదాంబ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు, అన్న ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు ఘననివాళులు అర్పించారు. డి.సత్యనారాయణ, రాధా కృష్ణ, పాలు సత్యనారాయణ, దుక్కల మూర్తి, తదితరులు పాల్గొన్నారు

జ్ఞానాపురం పరిధిలో...

జ్ఞానాపురం: టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 34వ వార్డులో వాసుపల్లి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో అచ్చియ్యమ్మపేట, 33వ వార్డులో ఎన్టీఆర్ సేవాసంఘం ఆధ్వర్యంలో కుమ్మరివీధి వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పేదలకు బియ్యం పంపిణీ చేశారు. 31వార్డు లీలామహల్ వద్ద సారిపల్లి మహేష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. 36వ వార్డులో కల్లేపల్లి గణపతి, 41వార్డులో ఐతి మధుబాబు, 33వ వార్డులో విల్లూరి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.


చీరలు పంపిణీ చేస్తున్న ఉత్తర ఇన్‌చార్జి విజయ్‌బాబు


సీతమ్మధారలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


కంచరపాలెంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తున్న నేతలు

22 నుంచి ఆలిండియా పోలీస్ కమాండో ఛాంపియన్‌షిప్

- టోర్నమెంట్‌లో పాల్గొననున్న 23 టీమ్‌లు
- గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ రాజీవ్‌కుమార్‌మీనా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్కే మీనా. చిత్రంలో గ్రేహౌండ్స్ డీఐజీ కోయ ప్రవీణ్, గ్రూప్ కమాండర్లు విద్యాసాగర్‌నాయుడు, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రేహౌండ్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 22 నుంచి 14వ ఆలిండియా పోలీస్ కమాండో ఛాంపియన్‌షిప్ (ఏఐపీసీసీ) పోటీలను నిర్వహించనున్నట్టు గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలీసులు, కేంద్ర పారామిలటరీ బలగాల్లో ఐక్యత పెంపొందించడం, దేహ దారుఢ్యం, పోటీతత్వం పెంచడమే లక్ష్యంగా 2008 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. 2018లో పదో ఏఐపీసీసీ పోటీలు జరగ్గా, కొవిడ్ కారణంగా 11, 12వ ఏఐపీసీసీ పోటీలు నిర్వహించలేదన్నారు. గత ఏడాది 13వ ఏఐపీసీసీ పోటీలు మానేసర్‌లో ఎన్ఎస్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఐటీబీపీ విజేతగా నిలిచిందన్నారు. ఈ ఏడాది జనవరి 22 నుంచి 30 వరకూ గ్రేహౌండ్స్ ఆధ్వర్యంలో 14వ ఏఐపీసీసీ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు 16 రాష్ట్రాల పోలీస్ జట్లతోపాటు ఏడు కేంద్ర పారా మిలటరీ బలగాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన జట్లు పాల్గొంటాయన్నారు. వీరందరికీ వసతి, రవాణా, భోజన సదుపాయాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఒక్కో జట్టులో 13 మంది క్రీడాకారులు ఉంటారన్నారు. ఒక్కో జట్టు నావిగేషన్, ప్రణాళికలు రూపొందించడం, సామర్థ్యం, నైపుణ్యం, ఓర్పు, ప్రజంటేషన్, పరుగు లేదా ఫైరింగ్ ఇలా ఐదు కేటగిరీల్లో పోటీ పడాల్సి ఉంటుందన్నారు. 22న జరిగే ప్రారంభ వేడుకలకు రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. 30న జరిగే ముగింపు వేడుకలకు రాష్ట్ర డీజీపీ కెశిరెడ్డి వెంకటరాజేంద్రనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ డీఐజీ కోయ ప్రవీణ్, గ్రూప్ కమాండర్లు విద్యాసాగర్‌నాయుడు, బిందుమాధవ్, స్క్వాడ్రన్ కమాండర్ డి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం బజారుకు స్పందన కరవు


వినియోగదారులు లేక వెలవెలబోతున్న నరసింహనగర్ రైతుబజారు

అక్కయ్యపాలెం, జనవరి 18: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో నిర్వహిస్తున్న సాయంత్రం బజారుకు స్పందన కనిపించడం లేదు. రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులు వినియోగదారుల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం సమయంలోనే వినియోగదారులు అంతంత మాత్రంగా వస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం పూట విక్రయిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు అమ్ముడవడం లేదని వారంతా వాపోతున్నారు. కనీసం తాము పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదంటున్నారు. ఉదయం సమయంలో విక్రయిస్తున్న తామే సాయంత్రం పూట కూడా బజారుకు వచ్చి విక్రయించాలంటే సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కూరగాయలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రావడం లేదంటున్నారు. దీంతో తీసుకొచ్చిన కూరగాయలు కుళ్లిపోతుండడంతో వాటిని చెత్తకుప్పలో పడేస్తున్నామంటున్నారు. దీనివల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. రైతుబజారులో గత ఏడాది డిసెంబరు 29 నుంచి సాయంత్రం పూట కూరగాయల విక్రయాలు పునఃప్రారంభమయ్యాయి. ఉదయం పూట విక్రయించి, ఇంటికి వెళ్లి రావాలంటే చార్జీలు ఎక్కువవుతాయేమోనని రైతులు ఇక్కడే ఉండిపోతున్నారు. సాయంత్రం పొలాల్లోకి వెళ్లి మరుసటి రోజు విక్రయించాల్సిన కూరగాయలను ఏరాల్సి ఉంది. కానీ ఇక్కడే ఉండి కూరగాయలను విక్రయించడం వల్ల మరుసటి రోజుకు కూరగాయలను సమకూర్చలేకపోతున్నామని వాపోతున్నారు. పోర్టు క్వార్టర్స్‌లో నివసిస్తున్న వారు రైతుబజారుకు వచ్చి కూరగాయలను కొనుగోలు చేయడంతో బేరాలు ఉండేవని క్వార్టర్స్‌ను పగులగొట్టిన తర్వాత విక్రయాలు బాగా తగ్గిపోయాయని, దీనికితోడు సాయంత్రం పూట బజారు వల్ల నష్టమే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. దీనిపై జేసీ స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వెంకటేశ్వరస్వామిని అవమానించిన బీజేపీ

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి


మాట్లాడుతున్న ప్రియాంక దండి

డాబాగార్డెన్స్, జనవరి 18: ప్రపంచానికి ఆదర్శప్రాయమైన హిందూ ధర్మాన్ని భారతీయ జనతాపార్టీ తన రాజకీయం కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి విమర్శించారు. ఈ మేరకు గురువారం మీడియాతో మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని బీజేపీ ఘోరంగా అవమానించందన్నారు. దక్షిణ భారతదేశ హిందువులు, తిరుపతిలో వెలిసిన వెంకటేశ్వరస్వామిని కలియుగ దైవంగా భావిస్తారన్నారు. అంత గొప్ప ప్రాముఖ్యత ఉన్న శ్రీవారి హుండీలో గత ఏడాది విదేశీ భక్తులు ఇచ్చిన విరాళానికి బీజేపీ ప్రభుత్వం టీటీడీ దేవస్థానం నుంచి రూ.3 కోట్లు అపరాధ రుసుము వసూలు చేసిందన్నారు. టీటీడీ బ్యాంకు ఖాతాలోకి వస్తే ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలు వరిస్తాయని అపరాధ రుసుం విధించడం శ్రీవారిని, పుణ్యక్షేత్రాన్ని అవమానించడమేనన్నారు. రుషికొండలో నిర్మించిన టీటీడీ దివ్య క్షేత్రానికి టీటీడీ రూ.21 కోట్లు కేటాయించిందన్నారు. అన్ని సేవలు అందిస్తున్న టీటీడీకి అపరాధ రుసుం విధించడంతో హిందూ ధర్మంపై బీజేపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని స్పష్టం చేసిందన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం బీజేపీ రాజకీయ లబ్ధికోసమే వాడుకుంటోంది తప్ప ఆపార్టీకి హిందూ మతంపై ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి హిందువుల మనోభావాలను పార్టీ నాయకత్వానికి తెలియజేసి అపరాధ రుసుము కింద వసూలు చేసిన డబ్బును వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జనవరి 18: సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నామని జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్ఆర్ఐ ఆసుపత్రి, బీఎస్ లేఅవుట్, సీతమ్మధార మోర్ సూపర్‌మార్కెట్, ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్, శాంతిపురం, సీతంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

నేడు చలో విజయవాడ

డాబాగార్డెన్స్, జనవరి 18: అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా చలో విజయవాడకు పిలుపునిచ్చినట్టు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్ కుమార్ తెలిపారు. డాబాగార్డెన్స్ బీఏకే చాంబర్స్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలంతా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో ఏడు వేల మంది షెడ్యూల్డ్ కులాల న్యాయవాదులున్నారని వీరంతా చలో విజయవాడకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ శశికళ, వాగువల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

'రెల్లి కులస్థులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

డాబాగార్డెన్స్, జనవరి 18: రెల్లి కులస్థులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఈ నెల 20న ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు రెల్లికుల ప్రతినిధి చెన్నా తిరుమలరావు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల దాటినా రెల్లి కులస్థులను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. ఈ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరుతూ ఈ నెల 20న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపడతామన్నారు. దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా రెల్లికుల ప్రతినిధులు, మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'ఎన్టీఆర్ స్ఫూర్తితో జగన్‌ను గద్దె దించాలి'

డాబాగార్డెన్స్, జనవరి 18: ఎన్టీఆర్ స్ఫూర్తితో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ పిలుపునిచ్చారు. గురువారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎదురులేని మనిషి ఆడియోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనపై పోరాటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వసుపులేటి ఉషాకిరణ్, కందుల నాగరాజు, పాలూరి శేషమాంబ, ఎ.ఉమాశంకర్, కేదారి లక్ష్మి, బి.దొరబాబు, జగదీష్, రమణ, జ్యోతి పాల్గొన్నారు.

నేడు పోలమాంబ ఉత్సవ రాట

జగదాంబ కూడలి, జనవరి 18: జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధిలో శుక్రవారం పోలమాంబ ఉత్సవానికి సంబంధించి రాట వేయనున్నారు. 22 నుంచి 24 వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

లబ్ధిదారులకు ఓటీఎస్ పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలు అందిస్తున్న కేకే రాజు

అక్కయ్యపాలెం, జనవరి 18: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ జీవో నంబరు 388 రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, ఓటీఎస్ ఇళ్ల పట్టాలను గురువారం వైసీపీ ఉత్తర ఇన్‌చార్జి కేకే రాజు పంపిణీ చేశారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానా కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ జయ, జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, బానాల శ్రీనివాసరావు, కంటిపాము కామేశ్వరి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: జీవీఎంసీ 35వ వార్డు దుర్గమాంబ ప్రసాద్ గార్డెన్స్ నివాసితులకు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు గురువారం ఇంటి హక్కుదారు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. వార్డులో ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 60 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉంటున్న నివాసితులు ఇంటి మీద హక్కు లేకుండా ఇబ్బందులు పడ్డారని, ఈనేపథ్యంలో కలెక్టర్ మల్లికార్జునను కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు.

కనకమహాలక్ష్మికి ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

జగదాంబకూడలి, జనవరి 18: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారిని దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయం వద్ద అయన ఈవో కె.శిరీష స్వాగతం పలికారు. వేదపండితులు వాసుపల్లి దంపతుల చేత అమ్మవారి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఈఈ రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్‌ఇండియా హోటల్స్ అసోసియేషన్ సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మహారాణిపేట, జనవరి 18: దక్షిణ భారత హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో మూడు రోజులు సదస్సు నిర్వహించనున్నట్టు దక్షిణాది రాష్ట్రాల హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ రాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం హోటల్ నోవాటెల్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 19, 20 21 తేదీల్లో నోవాటెల్‌లో సదస్సు జరుగుతుందన్నారు. ఐదు రాష్ట్రాల హోటల్స్ ప్రతినిధులు సదస్సులో వివిధ అంశాలను చర్చిస్తారన్నారు. టూరిజం శాఖా మంత్రులు పాల్గొంటారన్నారు. సమావేశంలో ఏపీ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి, జిల్లా అధ్యక్షుడు వసంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

కూడా వినిపిస్తోంది. ఇక పెందుర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు టికెట్ లేదని కొన్నాళ్ల కిందట అధిష్ఠానం చెప్పినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్‌కు పెందుర్తి నుంచి పోటీకి అవకాశం ఇవ్వడం ఖాయమని ప్రచారం జరిగినప్పటికీ, ఎందుకనో తిరిగి అదీప్‌రాజ్‌నే సన్నద్ధం కావాలని అధిష్ఠానం సూచించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి కూడా అవకాశం ఇవ్వకూడదని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్ అక్కడి నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారని, సీఎం జగన్ కూడా అంగీకరించారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కరణం ధర్మశ్రీని తాడేపల్లి పిలిచి వివరించగా, మంత్రి అమర్‌నాథ్‌కు తప్ప ఎవరికి అవకాశం ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని, లేనిపక్షంలో తనకు అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టంచేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై ఆసక్తినెలకొంది. నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు కూడా వచ్చే ఎన్నికల్లో పోటీకి అధిష్ఠానం నుంచి ఇంతవరకూ ఎలాంటి గ్రీన్‌సిగ్నల్ లభించలేదని సమాచారం. నాలుగో జాబితాలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన సమన్వయకర్తలు, ఇన్‌చార్జుల ప్రకటన ఉంటుందని అంతా ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే రెండు జిల్లాల ప్రస్తావన లేకపోవడంతో సిట్టింగ్‌లు, ఆశావహుల్లో ఉత్కంఠ మరికొంతకాలం కొనసాగనున్నది.

సిటీలో పేకాట డెన్‌లు

... 5వ పేజీ తరువాయి

సంయుక్తంగా గత రెండు రోజుల్లోనే నాలుగు కేసులు నమోదుచేశారు. ఫోర్త్ టౌన్ పరిధిలోని ఒక హోటల్‌లో, భీమిలిలోని ఒక గెస్ట్‌హౌస్‌లో, పీఎంపాలెం సమీపంలోని ఒక ఇంట్లో, పెందుర్తి స్టేషన్ పరిధిలో ఒక తోటలో పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేసి కేసులు నమోదుచేశారు. ఇకపై కూడా పేకాటపై దాడులు కొనసాగుతాయని పోలీస్ అధికారి ఒకరు స్పష్టంచేశారు. అలాగే పేకాట నిర్వాహకులతో చేతులు కలిపిన పోలీస్ అధికారుల గురించి కూడా సీపీ ఆరా తీస్తున్నట్టు సమాచారం. సీపీ వ్యవహారశైలితో పేకాటరాయుళ్లతో ఇంతకాలం అంటకాగిన పోలీస్ అధికారుల్లో ఆందోళన మొదలైంది.

హౌసింగ్‌లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

ఆశ్చర్యపోయారు. ఈలోగా జ్ఞానవేణి సీట్లో కూర్చున్న విషయం కలెక్టర్‌కు చేరడంతో అయన ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ పేషీ ఉద్యోగి ఒకరు జ్ఞానవేణికి ఫోన్ చేసి ప్రస్తుతానికి బాధ్యతలు తీసుకోవద్దని కోరారు. కలెక్టర్ ఆదేశాలు ఇచ్చిన తరువాతే చేరాలని సూచించడంతో ఆమె అంగీకరించారు. కాగా సాయంత్రం ఇన్‌చార్జి పీడీ అఖిల జిల్లా హౌసింగ్ కార్యాలయ పరిధిలోని ఇంజనీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చే వరకు తానే పీడీగా కొనసాగుతానని చెప్పారు. కలెక్టర్ సెలవు నుంచి తిరిగి వచ్చేంత వరకు అఖిల ఇన్‌చార్జి పీడీగా ఉంటారని, ఈలోగా కార్పొరేషన్ ఎండీ ఏమైనా ఆదేశాలు ఇస్తే అప్పుడు జ్ఞానవేణి చేరతారా?...అనేది సస్పెన్స్‌గా ఉందని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. మొత్తానికి తాము ఇరకాటంలో పడ్డామని వాపోతున్నారు.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న కోన తాతారావు, తదితరులు

పేదలకు వస్త్రాలు పంపిణీ

అగనంపూడి, జనవరి 18: అగనంపూడి చెందిన జనసేన నాయకుడు బలిరెడ్డి నాగేశ్వరరావు సమకూర్చిన వస్త్రాలను గురువారం సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు నిరుపేదలకు జనసేన పార్టీ గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో ట్రస్టు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దుల్ల రామునాయుడు, జి.సోమశేఖర్, డి.త్రినాథరావు, ట్రస్టు ప్రతినిధులు పి.రామఅప్పారావు, మస్తాన్‌రెడ్డి, జి.సుశీలగజేంద్రరావు, ఎస్.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరిదేశిమాంబ పరస



పెందుర్తి, జనవరి 18: మండలంలోని సరిపల్లిలో పరిదేశిమాంబ పరసను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం తీర్థంలో కోలాటాలు, చిడతలు సాముగారడీ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కర్రసాము విన్యాసాలు మరింతగా అబ్బురపరిచాయి.

కొత్తపాలెంలో పైడితల్లమ్మ తీర్థం..



గోపాలపట్నం: కొత్తపాలెంలోని మూడు గుళ్ల ఆవరణలో ఉన్న పైడితల్లమ్మ అమ్మవారి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరస సందడిగా సాగింది.

ఇళ్ల పట్టాల పంపిణీ ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 18: గాజువాక హౌస్ కమిటీ పరిధిలో ఉన్న 68వ వార్డుకు చెందిన రాజీవ్‌నగర్, అప్పన్నకాలనీ, గిరిప్రసాద్ కాలనీలకు చెందిన పలువురికి ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కార్పొరేటర్ గుడివాడ అనూష ప్రారంభించారు. మిందిలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, ఈటి శ్యామలరావు, ఎస్.నూకరాజు, వి.రమణ, చిట్టిబాబు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

శొంఠ్యాం బ్రాంచి పోస్టాఫీసు అప్‌గ్రేడ్

పెందుర్తి-రూరల్, జనవరి 18: పెందుర్తి సబ్ పోస్టాఫీసు పరిధిలోని శొంఠ్యాం బ్రాంచి సబ్ పోస్టాఫీసుగా అప్‌గ్రేడ్ అయింది. ఈ మేరకు ఈ నెల 25న సబ్ పోస్టాఫీసును ప్రారంభించనున్నట్టు విశాఖ డివిజన్ అధికారి ఎస్ఎస్‌పీ గజేంద్రకుమార్ మీనా తెలిపారు. ఈసబ్ పోస్టాఫీసులో అన్ని పొదుపు పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్ పథకాలు, మనీ ఆర్డర్లు, తదితర సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 28, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 52, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 38, దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 76, బరబాటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 42, దోసకాయలు 42, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..



గాజువాకలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పల్లా శ్రీనివాసరావు



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గణబాబు



పెందుర్తిలో నివాళులర్పిస్తున్న బండారు, పీలా శ్రీనివాసరావు, తదితరులు

అభివృద్ధి ప్రదాత ఎన్టీఆర్

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో నివాళులర్పించిన నాయకులు

గాజువాకటౌన్/ఉక్కుటౌన్‌షిప్, జనవరి 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో జరిగిన వర్ధంతి కార్యక్రమాలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు తేవడంతో పాటు అభివృద్ధి చేసిన ఘనత దివంగత ఎన్టీ రామారావుకే దక్కుతుందన్నారు. అనంతరం చేపట్టిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే స్టీల్‌ప్లాంట్ స్టోర్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్ బాబు, నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అదేవిధంగా 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదకుల వస్త్రాలు పంపిణీ చేశారు. నాయకులు బాశెట్టి అప్పారావు, సుదర్శన్, రమణ, తదితరులు పాల్గొన్నారు. 67వ వార్డులో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

పెదగంట్యాడ: సీతానగరం ఎన్టీఆర్ జంక్షన్‌లోని టీడీపీ వ్యవస్థాపకుని విగ్రహానికి పార్టీ వార్డు అధ్యక్షుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు పెద్దాడ సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు. పార్టీ మండల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నాయకులు పి.సోమునాయుడు, ఎం.పెంటయ్య, డి.పెరుమాళ్లు, టి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగపురుషుడు దివంగత ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. పలు పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నాయకులు కల్లేపల్లి శ్రీనివాసవర్మ, ఎస్ఎస్ విజయరామరాజు, బి.రాజన్ రాజు, డీవీ అప్పారావు, వి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. కూర్మన్నపాలెంలో టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. 88వ వార్డు పరిధి దువ్వాడలో ఎన్టీఆర్ విగ్రహానికి కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, నాయకుడు బండారు అప్పలనాయుడు, పుష్పమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా యాదవ జగ్గరాజుపేటలో పార్టీ సీనియర్ నాయకుడు గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఆటోనగర్‌లో టీడీపీ 70వ వార్డు ఇన్‌చార్జి చట్టి గోపి, అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.



76వ వార్డులో దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గంధం శ్రీనివాస్



వడ్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బొండా జగన్



అగనంపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పమాల వేస్తున్న సీబీఎన్ మిత్ర మండలి నేత హర్షవర్ధన్ ప్రసాద్



స్టీల్‌ప్లాంట్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న టీఎన్‌టీయూసీ నాయకుడు లెనిన్‌బాబు, తదితరులు

పెందుర్తి: పెందుర్తి కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఇంటింటి ఆత్మబంధువు అని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ అమర్ రహే, టీడీపీ జిందాబాద్ అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, నాయకులు వేగి పరమేశ్వరరావు, రెడ్డి నారాయణరావు, కరక దేవుడు, ఎ.అప్పలనాయుడు, కె.సుందరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 97వ వార్డులో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతలఅగ్రహారం బస్టాండ్ కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌లు పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీపురం కూడలిలో నాయకులు చిట్టిబోయిన అప్పలనాయుడు, సాధూరావు, అంజి, మురళి, తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

మల్కాపురం: రామకృష్ణాపురం హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.గణబాబు ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం సంక్షేమం మహనీయుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, నాయకులు మజ్జి సోమేశ్, కాకి పోలిరెడ్డి, కె.ఆదినారాయణ, డేవిడ్, కె.శ్రీనివాసరావు, పి.హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. నక్కవానిపాలెంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని కార్మిక నాయకుడు దేవర అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీహరిపురంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు రామ్మోహన్‌నాయుడు, పి.శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కాగా యారాడలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు పిల్లా అచ్చారావు పూలమాల వేసి నివాళులర్పించారు.

గోపాలపట్నం: గ్రేటర్ 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకుడు నందవరపు సోములు పుష్పమాల వేసి నివాళులర్పించారు. నేటి తరం నేతలకు ఎన్టీఆర్ ఆదర్శమని అన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు పరిధి సత్తివానిపాలెంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి టీడీపీ వార్డు అధ్యక్షుడు ఒమ్మి సత్యం, తదితరులు అంజలి ఘటించారు. కొత్తపాలెం, గోపాలపట్నం, తదితర ప్రాంతాల్లోనూ ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు.

అగనంపూడి: అగనంపూడి టోల్ గేటు సమీపంలోని పైలాన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు కర్రి దశేంద్ర, కరణం సత్యారావు, బి.సూర్య, జి.అప్పారావు, జి.కనకభవానీ, తదితరులు పాల్గొన్నారు... అలాగే 79వ వార్డు పరిధి పాతఅగనంపూడి, లంకెలపాలెం వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పాల్గొని ఎన్టీఆర్‌కు అంజలి ఘటించారు. అదేవిధంగా గాజువాక సీబీఎన్ మిత్ర మండలి ఆధ్వర్యంలో మినీ జగదాంబ జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు టి.హర్షవర్ధన్ ప్రసాద్ పుష్పమాల వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు నెల్లి శ్రీనివాసరావు, నరసింగరావు, అప్పలరాజు, జయరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేట (కంచరపాలెం): ఆర్పీపేట రైల్వే గేటు సమీపంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ 56వ వార్డు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతికి ఎన్టీఆర్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు పరిధి వెంకటేశ్వరకాలనీలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శీరం రాజేశ్, పార్టీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నాయకులు వి.జీవన్ బాబు, కె.గోపాలరాజు, ఎం.ఆనంద్, నిర్మలాకుమారి, వీర శేఖర్, తదితరులు పాల్గొన్నారు. తుంగ్లాంలో ఎన్టీఆర్ విగ్రమానికి నాయకులు ఎస్.సింహాచలం, జి.అప్పారావు, అర్జున్, రామిరెడ్డి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి బల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, నాయకులు బి.నరసింహనాయుడు, రెడ్డి నారాయణరావు, సేనాపతి శంకరరావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు. చీమలాపల్లి సమీపంలోని పొర్లుపాలెంలో టీడీపీ నాయకుడు గల్ల వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు కరాసలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకుడు వై.తిరుమలరావు ఆధ్వర్యంలో పలువురు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె



దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

పెందుర్తి, జనవరి 18: న్యాయ సమ్మతమైన తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం దీక్షా శిబిరం సమీపంలోని మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షల శిబిరాన్ని పీవోడబ్ల్యూ, అరుణోదయ నాట్య మండలి ప్రతినిధులు మౌలాలి, నిర్మల, ఇందిర సందర్శించి అంగన్‌వాడీలకు సంఘీభావాన్ని తెలిపారు. అంగన్‌వాడీలు న్యాయ పోరాటం చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ ప్రతినిధులు ఆర్.అనిత, బృంద, అంగన్‌వాడీ మండల శాఖ ప్రతినిధులు దేవి, లక్ష్మి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు

ఉక్కు సమ్మెకు కాంట్రాక్టు కార్మికుల మద్దతు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 18: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో చేపట్టనున్న కార్మిక సమ్మెకు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మద్దతు తెలిపారు. ఎల్ఎంఎంఎం పార్కులో గురువారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల వేతనాల అంశంపై ఎన్‌జేసీఎస్‌లో చర్చించి తక్షణమే పెంచాలని, 60 ఏళ్ల పైబడిన కార్మికులను తొలగించే సమయంలో ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, విధి నిర్వహణలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పి.భాస్కరరావు, కొవిరి అవతారం, ఎం.రమణ, శ్రీనివాస్, సోంబాబు, పిట్టా రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టరు ఆవిష్కరణ

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నూతన వేతనాలు చెల్లించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, తదితర పద్దెనిమిది డిమాండ్లతో ఈ నెల 29, 30 తేదీల్లో చేపట్టనున్న కార్మిక సమ్మెకు సంబంధించిన పోస్టరును గురువారం ఉక్కు బీసీ గేటు వద్ద కార్మిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సెయిల్‌లో చెల్లించిన మాదిరిగానే స్టీల్‌ప్లాంట్‌లో కూడా చెల్లింపులు జరిగేవని, కానీ ఇప్పుడు వాటిని ఉక్కు యాజమాన్యం విస్మరించిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, పులి వెంకటరమణారెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ వద్ద వ్యర్థాలకు నిప్పు

కమ్మేసిన పొగతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



దగ్ధమవుతున్న చెత్తాచెదారం

ఆటోనగర్, జనవరి 18: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారానికి గురువారం పలువురు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్‌ను మూసివేయడంతో దీని పరసర ప్రాంతాలు డంపింగ్ యార్డుగా మారాయి. ఈ నేపథ్యంలో పేరుకుపోయిన చెత్తకుప్పలకు ఎవరో నిప్పంటించడంతో మంటలు ఎగసిపడడంతో పాటు దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దుర్గంధంతో కూడిన పొగ సమీపంలోని ఆటోనగర్, తోకాడ, కుంచుమాంబ కాలనీ, శ్రీనివాసనగర్, దత్తసాయినగర్‌కు వ్యాపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దట్టమైన పొగ వల్ల వృద్ధులు, చిన్నారులు శ్వాసకోస సంబంధిత వ్యాధులకు గురికాక పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. పొగ వల్ల కళ్లు మండుతుండడంతో పాటు ఊపిరి తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని వాపోతున్నారు. తరచూ అన్న కాంటీన్ వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలకు నిప్పు అంటిస్తున్నారని.. దీంతో తాము ఇక్కట్లకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతిధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

1,071వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, జనవరి 18: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 1,071వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసింది శూన్యమన్నారు. ఆయన ఒక్క పలుకుతో ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ అంశం ఆగుతుందని, కానీ సీఎం జగన్ ఆ దిశగా యోచించకపోవడం శోచనీయమన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, గోపి, ప్రసాద్, ఆనంద్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 18: థైరాయిడ్ సమస్యను ప్రారంభంలోనే గుర్తించి సరైన మందులను సకాలంలో వాడితే దానిని నియంత్రించవచ్చని ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ శ్రావణి తాన్న అన్నారు. షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన థైరాయిడ్ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. థైరాయిడ్ సమస్య పురుషుల్లో కన్నా మహిళల్లోనే అధికంగా ఉంటుందన్నారు. థైరాయిడ్ గ్రంధి నుంచి ఉత్పత్తి అయ్యే హార్మోన్ల ప్రభావం శరీరంలోని అన్ని అవయవాలపైనా పడుతుందన్నారు. అందువల్ల దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

సృజనాత్మకతను పెంచే చిత్రలేఖనం



చిత్రకారుడు లక్ష్మణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

మల్కాపురం, జనవరి 18: చిత్రలేఖనం సృజనాత్మకతను పెంచుతుందని ప్రముఖ చిత్రకారుడు మంద లక్ష్మణమూర్తి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చిత్రలేఖన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిత్రలేఖనం ఒత్తిడిని తగ్గిస్తుందని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. షిప్‌యార్డు రచయితల సంఘం కార్యదర్శి, ప్రముఖ చిత్రకారుడు సుంకర చలపతిరావు మాట్లాడుతూ లక్ష్మణమూర్తి గీసిన అనేక చిత్రాలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు జీఎస్ రాజు, సీఎస్ఎన్‌రాజు, మనోహర్, శివ, సురేశ్, వెంకటరమణ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'జీవో నంబర్-388 ఎంతో ఉపయుక్తం'

ఎన్.ఎ.డి. జంక్షన్, జనవరి 18: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో జీవో నంబర్-388 ప్రకారం ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న లబ్ధిదారులకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. గురువారం శాంతినగర్‌లోని వార్డు సచివాలయంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలువురికి పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా ఇళ్లలో నివసిస్తున్నా పూర్తి హక్కులు లేకుండా ఇబ్బందులు పడుతున్నవారికి ఈ జీవో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ జయ, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైసీపీ నాయకుడు మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే కేంద్రం లక్ష్యం

బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

గాజువాక, జనవరి 18: దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో గురువారం పలువురికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ లేని పొయ్యి ప్రతి పేదవాడి ఇంట్లో ఉండాలని, వారంతా ఆనందంగా ఉండాలన్నదే తమ ధ్యేయమన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్‌ను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ తాతారావు, నాయకులు జిలకర్ర భువనేశ్వరి, కిలాని ముసలయ్య ప్రకాశ్, పైడిరాజు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కోలాటం బృందాలకు వితరణ

అగనంపూడి, జనవరి 18: పెదముషిడివాడ శివారు పచ్చికోరువానిపాలెం, గండివానిపాలెంలో గల రెండు మహిళా కోలాటం బృందాలకు స్థానిక జనసేన నాయకుడు కరణం నరసింగరావు ఆర్థిక సాయంతో గురువారం వేర్వేరుగా రెండు సౌండ్ సిస్టమ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ ప్రదర్శిస్తున్న కోలాటం నృత్యాలను అందరూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గండి బాబ్జీ


ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నజీర్, నివాళులర్పిస్తున్న నేతలు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

అక్కయ్యపాలెం, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. 26వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నూరు పార్టీ కార్యాలయంలో, సంగం ఆఫీస్ జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 43వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు ఎన్టీఆర్ విగ్రహానికి, ఉత్తర టీడీపీ ఇన్‌చార్జి విజయ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు. రాజగిరి కన్నారావు, కొయిలాడ వెంకటేష్, కాళ్ళ గౌరీ శంకర్‌నాయుడు, కన్నం వెంకటరమణారావు పాల్గొన్నారు. 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో నరసింహనగర్‌లో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. షేక్‌బాబ్జీ, కోట నరేష్, శెట్టి మోహన్‌దాస్, పలిశెట్టి అప్పన్న, ఎంపీ బాబ్జీరావు, అనసూరి మధు, కె.అప్పలనర్సమ్మ, పుక్కళ్ళ పైడికొండ తదితరులు పాల్గొన్నారు. 46వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పుక్కళ్ళ పైడికొండ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణపురంలోని ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. శ్యాం సుందర్, షైలపల్లి శ్రీను, లక్ష్మీ, లావణ్య, ఈశ్వరి, నూకన్న, యశోదమ్మ, ఆనందరావు, గోపి, సునీల్, జోష్ పాల్గొన్నారు. 47వ వార్డు రాంజీఎస్టేట్‌లో యాగాటి ఆదిలక్ష్మి చీరలు పంపిణీ చేశారు. చెంగల శ్రీనుబాబు, నూకరాజు, నూకరాజు, కేఎస్ మణి, రమణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

మద్రిపాలెంలో ...

మద్రిపాలెం: గ్రేటర్ 54వ వార్డు మద్రిపాలెం మహరాణివీధిలో టీడీపీ నేత కొలుసు సత్యారావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేసి బలహీనవర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానాయకుడు ఎన్టీఆర్ అన్నారు. మాధవరావు, సిమ్మా శ్రీను, చిటికెల నరసింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27, 42వ వార్డుల్లో...

దొండపర్తి: పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు వర్ధంతిని 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ పూలమాల వేసి నివాళులర్పించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కన్నం వెంకటరమణారావు, శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, జనపాల కృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. 27వ వార్డులో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. శ్రీనగర్ కూరగాయల మార్కెట్ వద్ద కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి సత్యనారాయణరెడ్డి, పి.లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణారావు, పి.గురునాథరావు, బీపీ రెడ్డి, కనకారావు పాల్గొన్నారు.

కంచరపాలెంలో...

కంచరపాలెం: 36వ వార్డు టీడీపీ నేతలు రైతుబజారు వద్ద పార్టీ కార్యాలయంలో పేదలకు దుప్పట్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. అనంతరం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.రాజు రెడ్డి, వై.కనకేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎన్.శంకరరావు, పి.నాగరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. 55వార్డు రెడ్డికంచరపాలెం ఆర్చ్ వద్ద నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేత రాజు రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పేదలకు పండ్లు, బియ్యం పంపిణీ చేశారు. 48వ వార్డు శ్రీనివాసనగర్‌లో గొర్లె అప్పారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గొర్లె నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో...

సీతమ్మధార: గురుద్వారా రోడ్డు ఎన్ఆర్ఐ ఆస్పత్రి సమీపంలో ఎన్టీఆర్ చిత్రపటానికి 14వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గొంప ధర్మారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. లక్ష్మణరావు, వీరభద్రరావు, తాతారావు, జగ్గారావు, పద్మ, నాగమణి, రాంబాబు, దేముడు పాల్గొన్నారు. 24వ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మలత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేముడుబాబు, శ్రీనివాసురెడ్డి, శివశంకర్, నూకరాజు, అప్పలరెడ్డి, పాల్గొన్నారు. 25వ వార్డు అధ్యక్షులు నమ్మి రవికుమార్ ఆధ్వర్యంలో సీతంపేట రాధాకృష్ణ మందిరం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇసరపు వెంకటలక్ష్మీవాసు తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో...

మురళీనగర్: బిర్లా జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. సనపల కీర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జయరాజ్, అప్పారావు, లలిత, మణికంఠ, ధవళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: గ్రేటర్ 30వ వార్డు జగదాంబ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు, అన్న ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు ఘననివాళులు అర్పించారు. డి.సత్యనారాయణ, రాధా కృష్ణ, పాలు సత్యనారాయణ, దుక్కల మూర్తి, తదితరులు పాల్గొన్నారు

జ్ఞానాపురం పరిధిలో...

జ్ఞానాపురం: టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 34వ వార్డులో వాసుపల్లి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో అచ్చియ్యమ్మపేట, 33వ వార్డులో ఎన్టీఆర్ సేవాసంఘం ఆధ్వర్యంలో కుమ్మరివీధి వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పేదలకు బియ్యం పంపిణీ చేశారు. 31వార్డు లీలామహల్ వద్ద సారిపల్లి మహేష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. 36వ వార్డులో కర్లేపల్లి గణపతి, 41వార్డులో ఐతి మధుబాబు, 33వ వార్డులో విల్లూరి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.


చీరలు పంపిణీ చేస్తున్న ఉత్తర ఇన్‌చార్జి విజయ్‌బాబు


సీతమ్మధారలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


కంచరపాలెంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తున్న నేతలు

వెంకటేశ్వరస్వామిని అవమానించిన బీజేపీ

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి

డాబాగార్డెన్స్, జనవరి 18: ప్రపంచానికి ఆదర్శప్రాయమైన హిందూ ధర్మాన్ని భారతీయ జనతాపార్టీ తన రాజకీయం కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి విమర్శించారు. ఈ మేరకు గురువారం మీడియాతో మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని బీజేపీ ఘోరంగా అవమానించందన్నారు. దక్షిణ భారతదేశ హిందువులు, తిరుపతిలో వెలిసిన వెంకటేశ్వరస్వామిని కలియుగ దైవంగా భావిస్తారన్నారు. అంత గొప్ప ప్రాముఖ్యత ఉన్న శ్రీవారి హుండీలో గత ఏడాది విదేశీ భక్తులు ఇచ్చిన


మాట్లాడుతున్న ప్రియాంక దండి

విరాళానికి బీజేపీ ప్రభుత్వం టీటీడీ దేవస్థానం నుంచి రూ.3 కోట్లు అపరాధ రుసుము వసూలు చేసిందన్నారు. టీటీడీ బ్యాంకు ఖాతాలోకి వస్తే ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలు వరిస్తాయని అపరాధ రుసుం విధించడం శ్రీవారిని, పుణ్యక్షేత్రాన్ని అవమానించడమేనన్నారు. రుషికొండలో నిర్మించిన టీటీడీ దివ్య క్షేత్రానికి టీటీడీ రూ.21 కోట్లు కేటాయించిందన్నారు. అన్ని సేవలు అందిస్తున్న టీటీడీకి అపరాధ రుసుం విధించడంతో హిందూ ధర్మంపై బీజేపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని స్పష్టం చేసిందన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం బీజేపీ రాజకీయ లబ్ధికోసమే వాడుకుంటోంది తప్ప ఆపార్టీకి హిందూ మతంపై ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి హిందువుల మనోభావాలను పార్టీ నాయకత్వానికి తెలియజేసి అపరాధ రుసుము కింద వసూలు చేసిన డబ్బును వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జనవరి 18: సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నామని జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్ఆర్ఐ ఆసుపత్రి, బీఎస్ లేఅవుట్, సీతమ్మధార మోర్ సూపర్‌మార్కెట్, ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్, శాంతిపురం, సీతంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

నేడు చలో విజయవాడ

డాబాగార్డెన్స్, జనవరి 18: అంబేడ్కర్ 125 అడుగల కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా చలో విజయవాడకు పిలుపునిచ్చినట్టు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్ కుమార్ తెలిపారు. డాబాగార్డెన్స్ బీఏకే చాంబర్స్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలంతా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో ఏడు వేల మంది షెడ్యూల్డ్ కులాల న్యాయవాదులున్నారని వీరంతా చలో విజయవాడకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ శశికళ, వాగువల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

'రెల్లి కులస్థులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

డాబాగార్డెన్స్, జనవరి 18: రెల్లి కులస్థులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఈ నెల 20న ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు రెల్లికుల ప్రతినిధి చెన్నా తిరుమలరావు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా రెల్లి కులస్థులను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. ఈ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరుతూ ఈ నెల 20న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపడతామన్నారు. దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా రెల్లికుల ప్రతినిధులు, మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'ఎన్టీఆర్ స్ఫూర్తితో జగన్‌ను గద్దె దించాలి'

డాబాగార్డెన్స్, జనవరి 18: ఎన్టీఆర్ స్ఫూర్తితో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ పిలుపునిచ్చారు. గురువారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎదురులేని మనిషి ఆడియోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనపై పోరాటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి ఉషాకిరణ్, కందుల నాగరాజు, పాలూరి శేషమాంబ, ఎ.ఉమాశంకర్, కేదారి లక్ష్మి, బి.దొరబాబు, జగదీష్, రమణ, జ్యోతి పాల్గొన్నారు.

నేడు పోలమాంబ ఉత్సవ రాట

జగదాంబ కూడలి, జనవరి 18: జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధిలో శుక్రవారం పోలమాంబ ఉత్సవానికి సంబంధించి రాట వేయనున్నారు. 22 నుంచి 24 వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

లబ్ధిదారులకు ఓటీఎస్ పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలు అందిస్తున్న కేకే రాజు

అక్కయ్యపాలెం, జనవరి 18: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ జీవో నంబరు 388 రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, ఓటీఎస్ ఇళ్ల పట్టాలను గురువారం వైసీపీ ఉత్తర ఇన్‌చార్జి కేకే రాజు పంపిణీ చేశారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానా కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ జయ, జోనల్ కమిషనర్ ఆర్‌పీ కృష్ణ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, బానాల శ్రీనివాసరావు, కంటిపాము కామేశ్వరి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: జీవీఎంసీ 35వ వార్డు దుర్గమాంబ ప్రసాద్ గార్డెన్స్ నివాసితులకు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు గురువారం ఇంటి హక్కుదారు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. వార్డులో ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లగా ఈ ప్రాంతంలో ఉంటున్న నివాసితులు ఇంటి మీద హక్కు లేకుండా ఇబ్బందులు పడ్డారని, ఈనేపథ్యంలో కలెక్టర్ మల్లికార్జునను కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు.

కనకమహాలక్ష్మికి ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

జగదాంబకూడలి, జనవరి 18: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారిని దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయం వద్ద అయన ఈవో కె.శిరీష స్వాగతం పలికారు. వేదపండితులు వాసుపల్లి దంపతుల చేత అమ్మవారి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఈఈ రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్‌ఇండియా హోటల్స్ అసోసియేషన్ సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

మహరాణిపేట, జనవరి 18: దక్షిణ భారత హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో మూడు రోజులు సదస్సు నిర్వహించనున్నట్టు దక్షిణాది రాష్ట్రాల హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ రాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం హోటల్ నోవాటెల్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 19, 20 21 తేదీల్లో నోవాటెల్‌లో సదస్సు జరుగుతుందన్నారు. ఐదు రాష్ట్రాల హోటల్స్ ప్రతినిధులు సదస్సులో వివిధ అంశాలను చర్చిస్తారన్నారు. టూరిజం శాఖా మంత్రులు పాల్గొంటారన్నారు. సమావేశంలో ఏపీ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి, జిల్లా అధ్యక్షుడు వసంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఆలిండియా పోలీస్ కమాండో ఛాంపియన్‌షిప్

» టోర్నమెంట్‌లో పాల్గొననున్న 23 టీమ్‌లు
» గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ రాజీవ్‌కుమార్‌మీనా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్కే. మీనా. చిత్రంలో గ్రేహౌండ్స్ డీఐజీ కోయ ప్రవీణ్, గ్రూప్ కమాండర్లు విద్యాసాగర్‌నాయుడు, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రేహౌండ్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 22 నుంచి 14వ ఆలిండియా పోలీస్ కమాండో ఛాంపియన్‌షిప్ (ఏఐపీసీసీ) పోటీలను నిర్వహించనున్నట్టు గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలీసులు, కేంద్ర పారామిలటరీ బలగాల్లో ఐక్యత పెంపొందించడం, దేహ దారుఢ్యం, పోటీతత్వం పెంచడమే లక్ష్యంగా 2008 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. 2018లో పదో ఏఐపీసీసీ పోటీలు జరగ్గా, కొవిడ్ కారణంగా 11, 12వ ఏఐపీసీసీ పోటీలు నిర్వహించలేదన్నారు. గత ఏడాది 13వ ఏఐపీసీసీ పోటీలు మానేసర్‌లో ఎన్ఎస్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఐటీబీపీ విజేతగా నిలిచిందన్నారు. ఈ ఏడాది జనవరి 22 నుంచి 30 వరకూ గ్రేహౌండ్స్ ఆధ్వర్యంలో 14వ ఏఐపీసీసీ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు 16 రాష్ట్రాల పోలీస్ జట్లతోపాటు ఏడు కేంద్ర పారా మిలటరీ బలగాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన జట్లు పాల్గొంటాయన్నారు. వీరందరికీ వసతి, రవాణా, భోజన సదుపాయాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఒక్కో జట్టులో 13 మంది క్రీడాకారులు ఉంటారన్నారు. ఒక్కో జట్టు నావిగేషన్, ప్రణాళికలు రూపొందించడం, సామర్థ్యం, నైపుణ్యం, ఓర్పు, ప్రజంటేషన్, పరుగు లేదా ఫైరింగ్ ఇలా ఐదు కేటగిరీల్లో పోటీ పడాల్సి ఉంటుందన్నారు. 22న జరిగే ప్రారంభ వేడుకలకు రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. 30న జరిగే ముగింపు వేడుకలకు రాష్ట్ర డీజీపీ కశిరెడ్డి వెంకటరాజేంద్రనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ డీఐజీ కోయ ప్రవీణ్, గ్రూప్ కమాండర్లు విద్యాసాగర్‌నాయుడు, బిందుమాధవ్, స్క్వాడ్రన్ కమాండర్ డి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం బజారుకు స్పందన కరవు


వినియోగదారులు లేక వెలవెలబోతున్న నరసింహనగర్ రైతుబజారు

అక్కయ్యపాలెం, జనవరి 18: గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో నిర్వహిస్తున్న సాయంత్రం బజారుకు స్పందన కనిపించడం లేదు. రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులు వినియోగదారుల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం సమయంలోనే వినియోగదారులు అంతంత మాత్రంగా వస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం పూట విక్రయిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు అమ్ముడవడం లేదని వారంతా వాపోతున్నారు. కనీసం తాము పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదంటున్నారు. ఉదయం సమయంలో విక్రయిస్తున్న తామే సాయంత్రం పూట కూడా బజారుకు వచ్చి విక్రయించాలంటే సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కూరగాయలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రావడం లేదంటున్నారు. దీంతో తీసుకొచ్చిన కూరగాయలు కుళ్లిపోతుండడంతో వాటిని చెత్తకుప్పలో పడేస్తున్నామంటున్నారు. దీనివల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. రైతుబజారులో గత ఏడాది డిసెంబరు 29 నుంచి సాయంత్రం పూట కూరగాయల విక్రయాలు పునఃప్రారంభమయ్యాయి. ఉదయం పూట విక్రయించి, ఇంటికి వెళ్లి రావాలంటే చార్జీలు ఎక్కువవుతాయేమోనని రైతులు ఇక్కడే ఉండిపోతున్నారు. సాయంత్రం పొలాల్లోకి వెళ్లి మరుసటి రోజు విక్రయించాల్సిన కూరగాయలను ఏరాల్సి ఉంది. కానీ ఇక్కడే ఉండి కూరగాయలను విక్రయించడం వల్ల మరుసటి రోజుకు కూరగాయలను సమకూర్చలేకపోతున్నామని వాపోతున్నారు. పోర్టు క్వార్టర్స్‌లో నివసిస్తున్న వారు రైతుబజారుకు వచ్చి కూరగాయలను కొనుగోలు చేయడంతో బేరాలు ఉండేవని క్వార్టర్స్‌ను పగులగొట్టిన తర్వాత విక్రయాలు బాగా తగ్గిపోయాయని, దీనికితోడు సాయంత్రం పూట బజారు వల్ల నష్టమే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. దీనిపై జేసీ స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

టికెట్ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

కూడా వినిపిస్తోంది. ఇక పెందుర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు టికెట్ లేదని కొన్నాళ్ల కిందట అధిష్ఠానం చెప్పినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్‌కు పెందుర్తి నుంచి పోటీకి అవకాశం ఇవ్వడం ఖాయమని ప్రచారం జరిగినప్పటికీ, ఎందుకనో తిరిగి అదీప్‌రాజ్‌నే సన్నద్ధం కావాలని అధిష్ఠానం సూచించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి కూడా అవకాశం ఇవ్వకూడదని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్ అక్కడి నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారని, సీఎం జగన్ కూడా అంగీకరించారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కరణం ధర్మశ్రీని తాడేపల్లి పిలిచి వివరించగా, మంత్రి అమర్‌నాథ్‌కు తప్ప ఎవరికి అవకాశం ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని, లేనిపక్షంలో తనకు అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టంచేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై ఆసక్తినెలకొంది. నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు కూడా వచ్చే ఎన్నికల్లో పోటీకి అధిష్ఠానం నుంచి ఇంతవరకూ ఎలాంటి గ్రీన్‌సిగ్నల్ లభించలేదని సమాచారం. నాలుగో జాబితాలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన సమన్వయకర్తలు, ఇన్‌చార్జుల ప్రకటన ఉంటుందని అంతా ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే రెండు జిల్లాల ప్రస్తావన లేకపోవడంతో సిట్టింగ్‌లు, ఆశావహుల్లో ఉత్కంఠ మరికొంతకాలం కొనసాగనున్నది.

సిటీలో పేకాట డెన్‌లు

... 5వ పేజీ తరువాయి

సంయుక్తంగా గత రెండు రోజుల్లోనే నాలుగు కేసులు నమోదుచేశారు. ఫోర్త్ టౌన్ పరిధిలోని ఒక హోటల్‌లో, భీమిలిలోని ఒక గెస్ట్‌హౌస్‌లో, పీఎంపాలెం సమీపంలోని ఒక ఇంట్లో, పెందుర్తి స్టేషన్ పరిధిలో ఒక తోటలో పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేసి కేసులు నమోదుచేశారు. ఇకపై కూడా పేకాటపై దాడులు కొనసాగుతాయని పోలీస్ అధికారి ఒకరు స్పష్టంచేశారు. అలాగే పేకాట నిర్వాహకులతో చేతులు కలిపిన పోలీస్ అధికారుల గురించి కూడా సీపీ ఆరా తీస్తున్నట్టు సమాచారం. సీపీ వ్యవహారశైలితో పేకాటరాయుళ్లతో ఇంతకాలం అంటకాగిన పోలీస్ అధికారుల్లో ఆందోళన మొదలైంది.

హౌసింగ్‌లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

ఆశ్చర్యపోయారు. ఈలోగా జ్ఞానవేణి సీట్లో కూర్చున్న విషయం కలెక్టర్‌కు చేరడంతో అయన ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ పేషీ ఉద్యోగి ఒకరు జ్ఞానవేణికి ఫోన్ చేసి ప్రస్తుతానికి బాధ్యతలు తీసుకోవద్దని కోరారు. కలెక్టర్ ఆదేశాలు ఇచ్చిన తరువాతే చేరాలని సూచించడంతో ఆమె అంగీకరించారు. కాగా సాయంత్రం ఇన్‌చార్జి పీడీ అఖిల జిల్లా హౌసింగ్ కార్యాలయ పరిధిలోని ఇంజనీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చే వరకు తానే పీడీగా కొనసాగుతానని చెప్పారు. కలెక్టర్ సెలవు నుంచి తిరిగి వచ్చేంత వరకు అఖిల ఇన్‌చార్జి పీడీగా ఉంటారని, ఈలోగా కార్పొరేషన్ ఎండీ ఏమైనా ఆదేశాలు ఇస్తే అప్పుడు జ్ఞానవేణి చేరతారా?...అనేది సస్పెన్స్‌గా ఉందని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. మొత్తానికి తాము ఇరకాటంలో పడ్డామని వాపోతున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జనవరి 18 : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్‌ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, కామాక్షినగర్, సీఐటీయూ కార్యాలయం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, శ్రీకాంత్‌నగర్ లేఅవుట్, కనకమహాలక్ష్మీనగర్, రాజీవ్‌నగర్, ఆరిలోవ పీఎస్, టీఐసీ పాయింట్, ఆరిలోవ ఆఖరి బస్టాపు, పాండురంగాపురం, నెహ్రూనగర్, దుర్గాబజార్, లక్ష్మీనగర్, శివాజీ నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైసీపీ పతనం మొదలు : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, జనవరి 18 : ఏయూ వీసీగా ప్రసాదరెడ్డిని మళ్లీ నియమించడంతో వైసీపీ పతనం ప్రారంభమయ్యిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతిరహిత పాలన అందిస్తున్నామని చెప్పే ముఖ్యమంత్రి జగన్ అవినీతిపరులకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. వీసీగా ప్రసాదరెడ్డి ఏయూలో గతంలో చేసిన అక్రమాలపై హైకోర్టులో కేసులు ఉన్నప్పటికీ మళ్లీ ఆయన్నే నియమించడం చూస్తే వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేకి అని అర్థమవుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రసాదరెడ్డి అవినీతిపై విచారణ జరిపి జైలుకు పంపించడం ఖాయమన్నారు.

22న శ్రీరామ శోభాయాత్ర

భీమునిపట్నం, జనవరి 18 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22న భీమిలిలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు తెలి పారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు దొరతోట రహదారిలో వున్న యోగాశ్రమం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. తెల్లవారుజామున 8.30 గంటలకు మొదలై భోయవీధి, నూకాలమ్మ గుడివీధి, శ్రీలక్ష్మీనరసింహస్వామి గుడివీధి, లంకాడవారి వీధి, కొంకివీధి, తోట వీధి రామాలయం మీదుగా సుభాష్ రోడ్‌లో వున్న వీరమల్లి రామాలయానికి చేరుకుంటుందని చెప్పారు. అలాగే సాయంత్రం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు.

పద్మనాభం సీఐగా శ్రీధర్

పద్మనాభం, జనవరి 18 : పద్మనాభం పోలీసు స్టేషన్ సీఐగా సీహెచ్ శ్రీధర్ నియామితులయ్యారు. ఈమేరకు నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న శ్రీధర్‌ను పద్మనాభం పీఎస్‌కు నియమించగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్.సన్యాసినాయుడును కమిషనరేట్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

బీమా సొమ్ము అందజేత

భీమునిపట్నం, జనవరి 18 : మంగమారిపేటకు చెందిన గరికిన లక్ష్మణరావు భార్య అమ్మాజీకి 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ. 10 వేలను గురువారం ఆమె స్వగృహానికి వెళ్లి అందించారు. లక్ష్మణరావు ఇటీవల సముద్రంపై వేటకు వెళ్లి మృతి చెందాడు.ఈమేరకు ఆమెకు బీమా సొమ్ము అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూడ అచ్యుతరావు, మేరుగు చిన్నారావు, వాసుపల్లి నూకరాజు, దూడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో 'స్వచ్ఛ సేవ'

సింహాచలం, జనవరి 18 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఏఈఓ భ్రమరాంబ పర్యవేక్షణలో ఆలయ ఉద్యోగులు గురువారం స్వచ్ఛ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు ఆలయ దక్షిణ రాజగోపురానికి చేరువలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నరసింగరావు, పర్యవేక్షణాధికారి లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ పరిసరాలను శుభ్రపరుస్తున్న సిబ్బంది

సినిమా గైడ్

- **నా సామిరంగా :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 28, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 52, బీరకాయలు 52, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారెట్ 38, దొండకాయలు 26, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 42, దోస కాయలు 42, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

యుగ పురుషుడు ఎన్‌టీఆర్

- వర్ధంతి సభల్లో వక్తలు
- తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో పలుచోట్ల నివాళి అర్పించిన నాయకులు



ఆర్కే బీచ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జనసేన నాయకులు, చిత్రంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

భీమునిపట్నం, జనవరి 18 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు 28వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని చిన్నబజారులో ఉన్న పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి జంక్షన్‌లో వున్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మండల అధ్యక్షుడు రాజు, నాయకులు పాసి నరసింగరావు, గొలగాని నరేంద్రకుమార్, బి. శ్రీనివాసరావు, ఎం. సత్యనారాయణ, జి. స్వామినాయుడు, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు. మంగమారిపేటలో మత్స్యకార నాయకుడు గరికిన ఎల్లయ్య (కింగ్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మైలపల్లి దానయ్య, బొడ్డు రాము, సూరాడ సతీష్, వాసుపల్లి ఎల్లయ్య, బొడ్డు రాము, బుడ్డల పోలయ్య, సూరాడ సతీష్, వాసుపల్లి నూకరాజు, దౌలపల్లి ఎల్లారావు, ఉమ్మడి హరి పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో...

విశాలాక్షినగర్ : జోడుగుళ్లపాలెంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి 9వ వార్డు నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, బుడుమూరి గోవింద్, వేజెళ్ల సుబ్బరాజు, మైలపిల్లి శ్రీను, నూకరాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, చిన్నారావు, రాజా, ఈగల కొండలరావు, గరికిన శ్రీను, బాలరాజు, పాల్గొన్నారు.



భీమిలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్ననేతలు

మధురవాడలో...

మధురవాడ : మధురవాడ పీహెచ్‌సీ సమీపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నాయకులు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకట్రావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి నాగోతి శివాజీ, వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, కానూరి అచ్చుతరావు, తెలుగు యువత నాయకుడు మామిడి దుర్గారావు, ఎస్సీ సెల్ విభాగం నేత సూరిబాబు, నాగోతి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ...

సాగర్‌నగర్ : ఎన్‌టీఆర్ చిరస్మరణీయుడని టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కె. రాజబాబు అన్నారు. సాగర్‌నగర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో జరిగిన ఎన్‌టీఆర్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, చిన్న గోపి, కాటూరి వీర్రాజు, సన్యాసిరావు, మంగాదేవి, బాబూరావు, జనసేన నాయకులు శాఖరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాడవాడలా సందడి

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.16వ వార్డులో ఇసుకతోట, కేఆర్ఎం కాలనీ, రజకవీధిలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు ముగడ వాసు, నారు గోపి, ఉమారాణి, ఆర్. అప్పన్న తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

20వ వార్డులో...

పెదవాల్తేరు : పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, శివారెడ్డి, చిన్నపిల్లి నరేంద్ర, గోపి, వాసు, మూర్తియాదవ్, గోవిందు, మురళి, దేవుడుబాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

సింహాచలం : సింహాచలం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, టీఎన్‌టీయూసీ నేత శీర కృష్ణ, జనసేన వార్డు అధ్యక్షుడు సూరిబాబు పాల్గొన్నారు.

5, 6 వార్డుల్లో..

కొమ్మాది : జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెం వద్ద వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి వెంకట సత్యనారాయణ, నమ్మి శ్రీను తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 6వ వార్డులోని క్రికెట్ స్టేడియం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు దాసరి శ్రీనివాస్, జి. ఆనంద బాబు, ఆర్. సత్యనారాయణ, గరే గురునాథ్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఆనందపురం, పద్మనాభంలో..

ఆనందపురం : మండలంలోని వేములవలస మహాత్మా గాంధీ పూలమార్కెట్ సమీపంలో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ వైస్ ఎంపీపీ మీసాల సత్యనారాయణ, ఉడా మాజీ డైరెక్టర్ గండ్రెడ్డి స్వామినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని ఎన్టీఆర్ పార్కులో ఎన్‌టీ రామారావు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్ఎఎన్ మూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. దామోదరరావు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచులు రమణ, పావని పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత : ఎమ్మెల్యే వెలగపూడి

బీచ్ రోడ్డు : ఎన్టీఆర్ యువతకు స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆర్కే బీచ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా పేదలకు అనేక పథకాలు అమలు చేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మీ చౌదరి, పెసలు శ్రీను, గుణలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : బడుగు, బలహీన వర్గాల కోసం ఆవిర్భవించిన పార్టీ టీడీపీ అని తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణబాబు అన్నారు. 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్చుతరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్‌టీఆర్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. అనంతరం 200 మంది వృద్ధులు దుస్తులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఒమ్మి సన్యాసిరావు, రాజారావు,ఒమ్మి అప్పలరాజు, పోలారావు, ఏడువాక సన్యాసిరావు గాడి సత్యం. పాల్గొన్నారు.

పనులు చేసినా..బిల్లులు ఇవ్వడం లేదు

- నాలుగేళ్లయినా ఎదురుచూపులే
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఎదుట సభ్యుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం, జనవరి 18 : గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి నాలుగేళ్లయినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కె. రాంబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాలను పూర్తి చేయాలని చెప్పారు. దీనిపై పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ స్పందిస్తూ.. పంచాయతీరాజ్, ఉపాధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు చెందిన పనులు చేపట్టి నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ చాలామందికి బిల్లులు చెల్లించలేదని, దీంతో చేసిన పనులకు అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. విద్యుత్ శాఖాధికారులు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు నిర్దేశించిన ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు వేయలేదని, ఇళ్లపై నుంచి ఉన్న లైన్లను మార్చడం లేదని సభ్యులు ఆ శాఖాధికారులపై ధ్వజమెత్తారు. అలాగే అయినాడ- రేవిడి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను నిలదీశారు. వీటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు బిల్లులు చెల్లించకపోవడం తనకు కూడా బాధగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు సూచించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ సూర్యనారాయణ, ఎంపీడీఓ ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, తహసీల్దారు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

భీమిలిలో అంగన్‌వాడీల ర్యాలీ

భీమునిపట్నం, జనవరి 18 : అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె చట్టబద్ధమైనదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. అంగన్‌వాడీలు గురువారం బీచ్‌రోడ్‌లో వున్న పైలాన్ నుంచి కృష్ణాకాలనీలో వున్న ఐసీడీఎస్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె విచ్ఛిన్నానికే ప్రభుత్వం జీవో 2 విడుదల చేసిందన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోగా, వారిని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించి సమ్మె విరమించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు కె. వెంకటలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, పద్మలక్ష్మి, సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంవీఐ శిరీష

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సింహాచలం, జనవరి 18 : ఆర్‌టీసీ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శిరీష అన్నారు. సింహాచలం డిపోలో జరుగుతున్న భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం సింహాచలం కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, ఆరోగ్యం పట్ల శ్రద్ధతో ఉండాలని, విధి నిర్వహణలో ఎటువంటి వ్యక్తిగత ఆలోచనలకు తావివ్వరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె. రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎల్. సాయితులసి, కేవీజీ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సమ్మెకు కాంట్రాక్టు కార్మికుల మద్దతు



సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 18: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో చేపట్టనున్న కార్మిక సమ్మెకు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మద్దతు తెలిపారు. ఎల్ఎంఎంఎం పార్కులో గురువారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల వేతనాల అంశంపై ఎన్‌జేసీఎస్‌లో చర్చించి తక్షణమే పెంచాలని, 60 ఏళ్ల పైబడిన కార్మికులను తొలగించే సమయంలో ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, విధి నిర్వహణలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పి.భాస్కరరావు, కొవిరి అవతారం, ఎం.రమణ, శ్రీనివాస్, సోంబాబు, పిట్టా రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. కాగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నూతన వేతనాలు చెల్లించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, తదితర పద్దెనిమిది డిమాండ్లతో ఈ నెల 29, 30 తేదీల్లో చేపట్టనున్న కార్మిక సమ్మెకు సంబంధించిన పోస్టరును గురువారం ఉక్కు బీసీ గేటు వద్ద కార్మిక నాయకులు ఆవిష్కరించారు.



గోపాలకృష్ణను సన్మానిస్తున్న కళాసాహితి సభ్యులు

సినీ దర్శకుడు గోపాలకృష్ణకు సన్మానం

భీమునిపట్నం, జనవరి 18 : ప్రస్తుత సమాజంలో యువ కళాకారులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని భీమిలి సీఐ డి. రమేష్ అభిప్రాయపడ్డారు. గురువారం చిన్నబజారులోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో కళాసాహితి ఆధ్వర్యంలో సినీ దర్శకుడు ఎన్. గోపాలకృష్ణను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు కళల ద్వారానే భవిష్యత్తు తరాలకు అందివ్వగలమన్నారు. బావి కళాకారులను ప్రోత్సహించడానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించాలని కళాసాహితి సభ్యులను కోరారు. సన్మాన గ్రహీత గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం సినిమాలు తీయడం ఖర్చుతో కూడుకున్న పని అని, హీరో కేంద్రీకృతంగా చిత్రాలు వస్తున్నాయన్నారు. ఇప్పుడు తాను డాక్యుమెంటరీలు తీస్తున్నానని చెప్పారు. కళా సాహితి అధ్యక్షుడు పీఆర్‌పీ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి అడిదం సన్యాసిరాజు, జానపద కళాకారుడు ఉప్పాడ అప్పారావు, రామానాయుడు, బొండా నర్సింహమూర్తి, చెన్నయ్యశెట్టి పాల్గొన్నారు. కాగా అంతకముందు నృత్యకారిణి దివ్య ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, జనవరి 18 : వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆర్జిత సేవలను గురువారం నుంచి పునఃప్రారంభించారు. గత నెల అధ్యయనోత్సవాలు పురస్కరించుకుని అన్ని రకాల ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. ఉత్సవాలు పూర్తి కావడంతో గురువారం నుంచి యథావిధిగా సుప్రభాత సేవ నుంచి రాత్రి ఆరాధన వరకు ఉన్న అన్ని ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఈమేరకు వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో ప్రధానార్చకుడు ఐవి రమణాచార్యులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారికి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

వార్డుల్లో పరసల సందడి

- ఈనెలలో వరుసగా ఉత్సవాలు

వెంకోజీపాలెం, జనవరి 18 : జీవీఎంసీ 17వ వార్డు కొత్తవెంకోజీపాలెంలో కోదండ రామ లీలా పరస మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు గృహోపకరణాలను విక్రయించారు. కమిటీ సభ్యులు రామాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. దీంతో పాటు జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత ఆలయాన్ని దర్శించుకునేందుకు ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల రమణ, కార్యవర్గ సభ్యులు కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, ఆడారి కామేశ్వరరావు,యర్రాజీ రెడ్డి, వైసీపీ నాయకులు పీల జోష్యుల, మద్దాల భాను, ఆడారి శ్రీను, పీల ప్రేమ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుకతోటలో నెత్తల పరస

16వ వార్డు ఇసుకతోటలో శుక్రవారం నెత్తల పరస జరగనుంది. ఈ సందర్భంగా గ్రామంలో సూరిశెట్టి కుటుంబీకులు నిర్మించిన నంది ఆలయంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం సంబరం చేయనున్నారు. అలాగే ఇదే నెలలో మద్దిలపాలెం, రేసపువానిపాలెం, పెదవాల్తేరు, పాతవెంకోజీపాలెం, ఆరిలోవ ప్రాంతాల్లోనూ పరసలు నిర్వహించనున్నారు.



పరసలో పలు వస్తువుల విక్రయాలు

తగరపువలస సంతలో సౌకర్యాల లేమి



ఆరుబయట విక్రయాలు సాగిస్తున్న రైతులు

తగరపువలస, జనవరి 18 : తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న కూరగాయల సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ కూడలిలో కొన్నేళ్లుగా సంత నిర్వహిస్తున్నారు. కొన్ని దుకాణాలకు మాత్రమే షెడ్లు ఉండగా, మిగిలిన వారు ఆరు బయట విక్రయాలు చేపడుతున్నారు. మరికొంతమంది రహదారి పక్కన,డివైడర్ల పైన అమ్మకాలు సాగిస్తున్నారు. దీనివల్ల తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆదివారం అయితే మరింత రద్దీ నెలకొంటోంది. తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు కూడా లేవు. వర్షం వస్తే సంతలో అడుగుపెట్టలేని పరిస్థితి ఉంటుంది. గతంలో సమీపంలో ఉన్న మున్సిపల్ స్థలంలో రైతుబజారు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. కానీ ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదు. పాలకులు, అధికారులు స్పందించి సంతలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారుల నృత్య ప్రదర్శన

ఎంవీపీ కాలనీ, జనవరి 18 : అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 13 నుంచి ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరిస్తున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మ ప్రచార పరిషత్, విశాఖ జిల్లా ధార్మిక సలహా మండలి, సాగర కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంయుక్తంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నాయి. గురువారం భాస్కరమ్మ బృందం, శ్రీకళా నృత్యనికేతన్ డ్యాన్స్ అకాడమీ, గాయత్రి బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆహ్లాదపరిచాయి. శ్రీరామ నామ సంకీర్త, శ్రీరామ రక్షా స్తోత్ర పఠనం, సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి అభిషేకం, సీతారాముల కల్యాణం, శ్రీరామ పాదుకా పట్టాభిషేకం, శోభాయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

1,071వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు



శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, జనవరి 18 : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,071వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కమిటీ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్ చేసింది శూన్యమన్నారు. ఆయన ఒక్క పలుకుతో ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ అంశం ఆగుతుందని, కానీ ఆ దిశగా యోచించకపోవడం శోచనీయమన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, గోపి, ప్రసాద్, ఆనంద్, సింహాద్రి, పాల్గొన్నారు.